# ఒక్క నిముషం

A. గీతారావు , Hyderabad

రజని: కమలా, కమలా ఏం చేస్తున్నావు? ఏమిటి ఏదో హడావిడిగా వున్నావు!

కమల: ఉగాది పండుగ కదా? ఏదో తుడవడాలు, కడగడాలు చేస్తున్నాను. ఏమిటి పొద్దున్నే ఇలా వచ్చావు!

రజని: అదే నేను కూడా పండగ కదా ఓ sweet, hot చేసి పడేద్దామని కజ్జికాయలు చేయడం మొదలెట్టాను. తీరా చూస్తే ఈ బుల్లి గ్లాసుడు పంచదార తక్కువయ్యింది. మన కమలనడిగి తీసుకుందాంలే అని యిలా వచ్చాను. చూశావా పని తొందరలో ఎలా వున్నానో అలాగే వచ్చాను.

కమల: (వ్యంగ్యంగా) అంటే నువ్వు యింట్లో చక్కగా తయారయి వంట చేస్తావన్నమాట.

రజని: నువ్వు మంచి చీర కట్టుకుని బూజులు దులపడంలేదూ?

కమ: సరేలే పంచదారకేం భాగ్యం కానీ, నీ చిన్నగ్లాసు యిలాతే. తీసుకువస్తాను. కుర్చో.

రజ: అయ్యబాబోయ్ కూర్చోవడమే, కుక్కర్ పెట్టివచ్చాను. ఒక్కనిముషంలో వెళ్ళిపోతాను.

కమ: ఇస్తాను కానీ ఇందాక కజ్జికాయలు అన్నావుకదూ! నేనెన్నిసార్లు చేసినా సరిగ్గా రావడంలేదు. వచ్చేవారం Ladies lunch కి చేద్దామనుకుంటున్నాను. కాస్త recipe చెబుదూ!

రజ: అమ్మో! recipe చెబుతూ కూర్చుంటే late అవదూ? చెప్పానుగా, ఒక్క నిముషంలో వెళ్ళిపోవాలి. సరే. ఇలా నుంచునే ఒక్కనిముషంలో చేప్పేస్తా రాసుకో.

కమ: ఉండు, పుస్తకం తెస్తా. ఆ చెప్పు కోవాతో చేస్తారు అవి.

రజ: ఆ....ముందుగా బజారునుండి కోవా తెచ్చుకుని దాన్ని మూకుడులో వేయించి దోరగా అయ్యాక.... అయ్యబాబోయ్ కుక్కర్ పడేసివచ్చా ఒక్కనిముషంలో వెళ్ళిపోదామని....వస్తా... (వెళ్ళబోతుంటే కమల ఒక్కనిముషం అని ఆపుతుంది).

కమ: యిప్పుడేగా వచ్చావు, ఈ recipe పూర్తి చేసి వెళ్ళిపోదువుగానిరా... కూర్చో.

రజ: అయ్యబాబోయ్ నేను ఎక్కడా ఒక్కనిముషంకంటే కూర్చోను.

కమ: సరే నుంచునే చెప్పు, ఆ తరువాత?

రజ: ఆ తరువాత కొబ్బరి తురుముకుని దాన్నికూడా వేయించాలి.

కమ: ఆగాగు. కొబ్బరి అంటే గుర్తొచ్చింది మన వీధి చివర కొబ్బరిచెట్టు ఇంటావిడ లేదూ, వాళ్ళ అమ్మాయి గురించి నీకు చెప్పానా?

రజ: ఊ.... నాకెందుకు చెబుతావులే, అయినా ఎలాగో తెలిసింది. అమ్మో నా కుక్కర్....వెళ్ళొస్తాను (వెళ్ళబోతుంది).

కమ: ఒక్కనిముషం ఆగు, అసలు ఆ విషయం నేను చెప్పకుండా, నీకు ఎలా తెలిసిందో నువ్వు నాకు చెప్పకుండా వెళ్ళిపోతే నాకు కడుపుబ్బిపోదూ?

రజ: అదేనువ్వు ఎవరితోనూ చెప్పవద్దని ఒట్టేయించుకుని సుధతో చెప్పావా? తను లక్ష్మితో చెప్పిందట. లక్ష్మి ఏమో రమణి, రోజాలకి చెప్పిందట. అందులో రమణి లతకి చెబితే రోజా మాత్రం ఎవరితో చెప్పొద్దని ఒట్టేయించుకుని నాతో చెప్పింది.

కమ: చూశావా, చూశావా ఈ రోజుల్లో ఎవరితోనూ ఏమీ చెప్పకూడదు. అది సరే గానీ నీ ఒక్క నిముషం పూర్తయ్యేలోపు ఆ recipe పూర్తిచెయ్యి.

రజ: ఆ...మనం ఎక్కడవున్నాం? ఆ కొబ్బరి, ఆ తరువాత పంచదార చక్కగా పొడిచేసుకుని అందులో కలపాలి. అవునూ...పండక్కి ఏం చీర కొన్నావూ?

కమ: ఇక్కడి చీరలా? No way. Bombay నుండి డిజైనర్ చీరలు తెప్పించాను. అదే, హిందీ సీరియల్స్ లో తులసి, పార్వతి, ప్రియా కట్టుకుంటారు అవి. మాచెల్లెలి తోడికోడలి వదినగారి తమ్ముడి వియ్యంకుడు వాళ్ళు బొంబాయిలో వున్నారు. వాళ్ళు పంపించారు. అవునూ, నువ్వు ఇక్కడే కొన్నావా?

రజ: అడిగావూ? అదే చేద్దామని కళానికేతన్ sale అయితే వెళ్ళాను. అక్కడ ఎంత రష్‌గా వుందనుకున్నావ్! పెద్ద బెంజ్ కార్లలో అక్కడికి వచ్చి ఆ చీరలకోసం క్యూలో నిలబడతారు. లోపలికెడితే ఏదో వూరికే మిఠాయిలు పంచుతున్నట్లు ఆడవాళ్ళంతా చీరలు గట్టిగా పట్టేసుకుని వదలరు. అతికష్టం మీద ఓ చీర సగం నాచేతికి చిక్కింది. మిగతా సగం ఇంకో ఆవిడ చేతికి చిక్కింది. ఇద్దరం కలిసి లాగేసరికి ఆ చీర కాస్తా ఫ్పరున చిరిగి ఉరుకుంది. గప్‌చిప్‌గా అక్కడ వదిలేసి వచ్చేశాం. అమ్మో నా కుక్కర్. ఒక్క నిముషం అనుకుని వచ్చాను, చాలా time అయినట్టుంది (వెళ్ళబోతుంది).

కమ: ఆగు, sim లోనే పెట్టివచ్చావుగా, sim లో పెడితే ఏమీ అవదు.

రజ: అయితే sim లో పెడితే ఏమీ అవదంటావా?

కమ: నేను experience తో చెబుతున్నాను, విను. నేను కుక్కర్ sim లో పెట్టి మా colony అంతా తిరిగివస్తాను. అదిసరే, మీరంతా కలిసి ఆమధ్య 'ప్రగతి సేవాసంఘం' అని ఏదో start చేశారుట కదా. పైగా సేవచేస్తాం, సేవచేస్తాం అని ఏదో పల్లెటూరికి కూడా వెళ్ళి వచ్చారుట కదా! అక్కడి ఏర్పాట్లు అవీ ఎలా వున్నాయి?

రజ: ఆ ఏర్పాట్లు పాడా, ఒక్క వీడియో కెమేరా కూడా లేదనుకో. పోనీ మామూలు ఫొటోగ్రాఫర్ కూడా లేడు. ఆ పల్లెటూళ్ళో ఆఖరికి ఎవరినో పట్టుకుని అక్కడ రోడ్లు ఊడుస్తున్నట్లు **photos** తీయించుకున్నాం.

కమ: అవునూ ఆఫొటోలు అవీ పేపర్లో పడతాయి అన్నావు కదా? పడ్డాయా?

రజ: ఆ పడ్డాయి. బోర్లబొక్కలా. పడకపోవడమే మంచిదయిందనుకో. ఆ సుధలేదూ? నన్ను ఒక్క ఫొటోలోనూ పడనివ్వకుండా ప్రతి ఫొటోలోనూ చీపురు పుచ్చుకుని తనే తయారు!

కమ: అదికాదు రజనీ నేనడిగింది. వీడియోలూ, ఫొటోల ఏర్పాట్లు గురించికాదు, అక్కడి వాళ్ళకి మందులు, మాకులు, పాతబట్టలూ అవీ మీరు తీసికెళ్ళారా లేదా అని.

రజ: ఏమో బాబు. ఆ సంగతులు నాకు తెలియవు. ఆ **Ms**. రావు లేదూ, **A/C** కారులో తీసికెడతానూ అని అంటే సరే అన్నాను. తీరా ఓ డొక్కు జీపులో వెళ్ళాల్సివచ్చింది. ఒళ్ళంతా హూనం అయిపోయిందనుకో. అమ్మో నా కుక్కర్, నేవెళ్ళాలి (వెళ్ళబోతుంది).

కమ: అబ్బ ముందు ఆ రెసిపి పూర్తి చేసెయ్యి, రా కూర్చో.

రజ: అమ్మో కూర్చోవడమే, యిలా నుంచొనే చెప్పేస్తా, ఆ ఎక్కడ వున్నాం? ఆ కోవా, కొబ్బరి, పంచదార, ఏలకుపొడి అన్నీ కలిపాక మైదా అవునూ కమలా ముఖ్యమైన విషయం మర్చిపోయా. నిన్న 'సాస్ భీ కభీ బహూతీ' చూడలేదు. కథ ఏం జరిగింది?

కమ: అదా! తులసికంటే 50 సంవత్సరాలు పెద్దదయిన కేతకీ చావీ **heavy work** చేసిన చీర కట్టుకుని, నల్లజుట్టు పెద్ద నెక్లెసు, ఇంకా పెద్ద లోలకులూ పెట్టుకుని హోలీ ఆడుతూ వుంటుంది. ఇంతలో 106 సంవత్సరాల బా అందరికంటే ఆరోగ్యంగా నడిచి వచ్చి పిల్లలందరితో డండియా ఆడుతుంది. ఆ పిల్లల్ని నేను గుర్తుపట్టలేదు. ఎందుకంటే, **last week** వేరే పాత్రధారులు ఆ పాత్రలు వేశారు. డ్రెస్సులు, నగలూ మన తెలుగు గానీ, హిందీగానీ సీరియల్స్‌లో ఎంత బాగుంటున్నాయో, నాకయితే ఆ సీరియల్స్ చూస్తుంటే ఏ పనీ చెయ్యబుద్దవదు.

రజ: అవును కమలా. పైగా సీరియల్స్‌లో ఎవరైనా చనిపోతే ఆ వ్యక్తి ఓ 5,6 ఎపిసోడ్స్‌లో తప్పక తిరిగి వారి రూపంలోనో, వేరే రూపంతోనో తిరిగి వస్తాడు. అలా నిజజీవితంలో జరగదుకదా! అవును కమలా ఈ మధ్య నువ్వు 4 **TV**లు, 6 **Cell phones** కొన్నావని విన్నాను, నిజమా!

కమ: అవును రజనీ. నాకు **live shows** అంటే చాలా ఇష్టం. ఆ మధ్య నేను 10వేల చీర, బంగారుగొలుసు, **Mixie**, **Stove** గెలుచుకున్నాను ఒక **channel contest** లో.

రజ: అవును. నాకు తెలుసులే. ఆదేఫలానా **episode** లో వున్న భర్యాభర్తలు 10 ఎపిసోడ్స్ తరువాత ఎవరి భార్యాభర్తలుగా మారుతారు? వారివారి పిల్లలు ఎవరెవరు? ప్రస్తుతం ఎవరు భార్యాభర్తలుగా వున్నారు? అజ్ఞాతంగా వున్న వారి పిల్లలు వారిని కలిశారా? అనేకదూ! నేనూ కొంతదూరం **try** చేసి ఆపేశాను.

కమ: అవును. కొంచెం **confusing** అయినాగానీ కష్టపడి అన్ని ఎపిసోడ్స్ చూసి **SMS** చేశాను. ప్రైజులొచ్చాయి. ఇప్పుడు మా ఇంటిల్లిపాదీ తలా ఒక **TV** ముందు **cell phone** పట్టుకు కూర్చుంటున్నాం.

రజ: నిజమే. ఇంటెడు సామాన్లూ ఊరికే వస్తాయికదా! **Very good**.

కమ: కానీ **SMS**లు కొట్టికొట్టి వేళ్ళు వాచిపోతాయి.. **Registration** కి నెలకి ఓ 2,3 వేలు ఖర్చవుతాయి అంతే. అంతేకాకుండా మావారికి ఈ మధ్య **dance master** ని పెట్టి **practice** చేయిస్తున్నాను. బాగా **improve** అయ్యారు. కొంచెం మోకాలు, ఓ చిటికెనవేలు దెబ్బ తిన్నాయి. మరి ఫారిన్ ట్రిప్ కావాలంటే ఆమాత్రం కష్టం తప్పదు. ఓ రూమ్ లో మా పిల్లలు డాన్స్ నేర్చుకుంటారు. ఇంకో చోట మా అత్తగారు ప్రశ్నలు, సమాధానాలు వల్లె వేస్తుంటారు.

రజ: అంటే నీ టీవీ పురాణంతో మీకు ఇంట్లో పనిచేసే టైము వుండదనుకుంటాను. నీ అదృష్టంకొద్దీ పనిమనిషి మంచిదనుకుంటాను.

కమ: అవును. దాని పిల్లల **B-Day** కి టీవీ లైవ్ షోస్ లో విష్ చెయ్యాలి. ఈ మధ్య నీ పనిమనిషి సరిగ్గా రావడం లేదన్నావ్?

రజ: అడిగావు పనిమనుషులసంగతి? అదో అంతులేనికథ. ఎందుకు రావడంలేదని అడుగుతానని ముందే కామిడీ చేస్తుంది. మొన్న నాదగ్గరికి పరిగెత్తుకువచ్చి 'అమ్మగోరూ, అమ్మగోరూ మనింటిముందు ఆంజనేయస్వామి బండొచ్చి ఆగిపోనాదండీ' అని అంది. అయితే దేముడి రథం ఊరేగింపా, ఓ కొబ్బరికాయకొట్టి హారతి యిద్దాం అని అన్నా. 'కాదమ్మా అది కారండీ! హనుమంతులవారి కారో, ఆంజనేస్వామి కారో ఏమిటో అంది. "ఓహో, అంటే మారుతీ కారా?' అంటే అవునంది. ఆ ఇందాక ఏదో అంటున్నావు (అంటూ 2 కుర్చీల్లో కూర్చుంటారు, సౌండు లేకుండా కుర్చీలు దగ్గరికి జరుపుకుంటూ మాట్లాడుకుంటూవుంటారు).

కమ: (హఠాత్తుగా లేచి) ఉండు రజనీ చాలా దగ్గరగా గంటల చప్పుడు వినిపిస్తోంది. **fire engine** గంటల్లా వున్నాయేమిటీ?

రజ: (కుర్చీలోంచి లేవకుండానే) ఏముంది? మన కాలనీ పక్కన గుడిసెలు వున్నాయికదా? వాళ్ళకసలు వొళ్ళూపై తెలవదు. ఎప్పుడూ ఏదో ఒకటి

తగలబెట్టుకుంటూనే వుంటారు. అందుకే అగ్నిప్రమాదాలు ఎక్కువయ్యాయి. అదేమిటీ? ఆ కిటికీ దగ్గర నిలబడిపోయావు! ఏదో జోక్ చెబుతున్నావు చెప్పు.

కమ: -- - - - -

రజ: అమ్మో నేనొచ్చి 4 గం: అయిందా? నా కుక్కర్ (ఇంతలో హడావిడిగా మాలతి ప్రవేశం)

కమ: అదిగో, మాలతి వస్తోంది. అసలే మతిమరపు ఎక్కువ తనకి.

మాల: రజనీ ఇక్కడున్నావా? నీకోసం కాలనీ అంతా తిరిగివచ్చాను. మీరిద్దరూ యిక్కడ తీరిగ్గా ఖబుర్లు చెప్పుకుంటున్నారా?

రజ: రా మాలతీ. కమల ఏదో జోక్ చెబుతోంది. నువ్వు కూడా కూర్చో.

మాల: అబ్బ, వుండు మర్చిపోతాను,నీకు ఒక ముఖ్యవిషయం చెప్పడానికి వాళ్ళంతా నన్ను యిక్కడికి పంపించారు.

రజ: ఎవరు పంపారు?

మాల: అదే చెప్తున్నానా? మధ్యలో ఆపితే నేను మర్చిపోతానని నీకు తెలుసుకదా? మరి మరి నన్ను ఎందుకు పంపారంటే----

కమ: ఇదిగో మాలతీ ఈ జోక్ విను. భర్త భార్యతో 'డార్లింగ్, ఇవాళ ఇడ్లీలేమిటి యింత తెల్లగా వున్నాయి?' అంటాడు. అపుడు భార్య 'రెండు చుక్కలు ఉజాలా వేశానండీ' అంటుంది. (అందరూ నవ్వుతారు)

మాల: జోక్ బావుంది గానీ, నేను వచ్చిన విషయం మర్చిపోతే అది నీకే నష్టం రజనీ!

రజ: అబ్బ, మాలతీ గుర్తుచేసుకుని సరిగ్గా చెప్పు. నీ బుర్రలో గంట లేటుగా కొడుతుంది.

మాల: ఆ, అదే ఆ గంటలు వినిపించడంలేదూ! అదేమిటంటే

కమ: ఇదిగో మాలతీ, నాకింకో మంచి జోకు గుర్తొచ్చింది. ఒక సర్దార్జీ టీవీ షాపుకు వెళ్ళి 'ఏవండీ, కలర్ టీవీస్ వున్నాయా?' అని అడిగాడు. షాపతను 'వున్నాయి' అన్నాడు. అప్పుడు సర్దార్జీ వెంటనే 'ఒక గ్రీన్ కలరు టీవీ ఇవ్వండి' అన్నాడు.

మాల: చాలా బాగుంది కమలా, నీదగ్గరికి వచ్చి కొన్ని జోక్స్ రాసుకుంటాను. నాకు గుర్తుండదు కదా అందుకు. పాపం రజని ఇంట్లో మంటలు కదా!

రజ: అదేమిటీ సరిగ్గా చెప్పు.

మాల: మరే మీఇల్లు తాళం వేసుంది. వంటింట్లోంచి పొగలు, మంటలు వచ్చేస్తున్నాయి. అందరూ అక్కడ ఖంగారు పడుతున్నారు. **Fire engine** వచ్చింది మంటలార్పడానికి, యిందాకటి నుండి నన్ను చెప్పనివ్వరూ..

రజ: నీ మతిమరపు బంగారంగానూ బాబోయ్ నాకుక్కర్ **(freez**)

మాల: మధ్యలో కుక్కరేమిటీ?

కమ: ఒక్క నిముషం

*****